


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక




సంపుటి: 01 సంచిక : 240. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ గురువారం.12.06.2025 పేజీలు:4, వెల:రూ.1.00

# 50 నిమిషాలు..18 ప్రశ్నలు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: కాళేశ్వరం నీటిపారుదల ప్రాజెక్టు బ్యారేజీల వైఫల్యంపై మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును న్యాయవిచారణ కమిషన్ విచారించింది. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 12:50 నిమిషా ల వరకు ప్రశ్నలను సంధించింది. విచారణ కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్‌తోపాటు కార్యదర్శి మురళీధర్, కేసీఆర్ ముగ్గురే ఉన్నారు. ఇందులో అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ఎవరికీ అనుమతించలేదు. తొలుత ఓపెన్ హాల్‌లో విచారణ చేయాలని కమిషన్ చైర్మెన్ భావించినా 'తన ఆరోగ్యం బాగాలేదనీ, జలుబుతో స్వల్ప అనారోగ్యానికి గురయ్యానని, వన్ టూ వన్ అయితే తాను స్పష్టంగా సమాధానాలు చెప్పగలనని' కేసీఆర్ చేసిన విజ్ఞప్తికి కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్ అనుమతించారు. దీంతో ముగ్గురు మాత్రమే ఓపెన్ హాల్‌లో ఉన్నారు. మీడియాతో పాటు ఇతరులను ఓపెన్ హాల్ నుంచి బయటకు పంపారు. సుమారు 50 నిమిషాల పాటు సాగిన విచారణలో కేసీఆర్‌ను పదుల సంఖ్యలో కమిషన్ ప్రశ్నలు వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు తొలి నుంచి చివరి దాకా జరిగిన ప్రక్రియపై సమాచారం రాబట్టినట్లు తెలిసింది. 115వ సాక్షిగా హాజరైన కేసీఆర్ నుంచి అఫిడవిట్ సైతం తీసుకున్నారు.

క్యాబినెట్ అనుమతి ఉందా ? కేసీఆర్‌కు కమిషన్ సూటి ప్రశ్నలు

విచారణ సందర్భంగా కేసీఆర్‌ను కాళేశ్వరం కమిషన్ 18 ప్రశ్నలు అడిగింది. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణానికి ఎవరు నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించింది. ఈ క్రమంలో కాళేశ్వరం రీ ఇంజినీరింగ్ గురించి కేసీఆర్ కమిషన్‌కు వివరించారు. క్యాబినెట్, ప్రభుత్వ ఆమోదంతోనే బ్యారేజీల నిర్మాణం జరిగిందని సమాధానమిచ్చారు. వ్యాప్కోస్ సిఫారసుల ప్రకారం నిర్మాణం జరిగిందనీ, అన్నీ అనుమతులు తీసుకున్నామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అన్నీ అంశాలతో కూడిన ముద్రించిన పుస్తకాన్ని కమిషన్‌కు అందజేశారు. కాళేశ్వరం కార్పొరేషన్ గురించి కూడా కమిషన్ ఆరా తీసింది. నూతన రాష్ట్రంలో నిధులను దృష్టిలో ఉంచుకుని కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు కేసీఆర్ కమిషన్‌కు తెలియజేశారు. ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. బ్యారేజీల్లో నీటి నిల్వ గురించి కేసీఆర్‌ను కమిషన్ ఆరా తీయగా, ఎంత నీరు నిల్వ చేయాలన్నది ఇంజినీర్లకు సంబంధించిన అంశమనీ కేసీఆర్ అభిప్రాయపడ్డారు. బ్యారేజీల నిర్మాణం స్థలం ఎంపిక, మార్పు సాంకేతిక పరమైన విషయమని వివరించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మెన్‌కు జీవో నెంబరు 45, ఆపరేషన్, నిర్వహణ పుస్తకాన్ని అందజేశారు.

ఇప్పటికే 114 మందిని విచారణ

కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రావడం సంచలనమే అయింది. బీఆర్కే భవన్‌లో ఆయన్ను జస్టిస్ బీసీ ఘోష్ ప్రశ్నించారు.




రీ ఇంజినీరింగ్, ఆనకట్టల నిర్మాణం, ఒప్పందాలు, కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, నీటి నిల్వలపై ఆయన్ను ఆరా తీశారు. ఇప్పటివరకు 114 మందిని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించింది. ఇప్పటివరకు అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ప్రశ్నించిన ఘోష్ కమిషన్ ఇటీవలే మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, మరో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును సైతం విచారించిన సంగతి తెలిసిందే. మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీలు రావడం తదితర కారణాల నేపథ్యంలో గత ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్‌తో ప్రభుత్వం న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి బ్యారేజీల నిర్మాణ ఇంజినీర్లు, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్, నిర్వహణ, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో), నీటిపారుదల, ఆర్థిక శాఖల అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారించడం, వారి నుంచి అఫిడవిట్లు తీసుకుని క్రాస్ ఎగ్జామినేషన్‌ను సైతం పూర్తిచేసింది. తాజాగా కేసీఆర్‌ను పిలిచింది. బుధవారం ఎర్రవల్లి ఫామ్‌నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమైన కేసీఆర్, హైదరాబాద్‌లో బీఆర్కే భవన్ వరకు భారీ కాన్వారుతో వచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందస్తు తనిఖీలు సైతం నిర్వహించారు. బీఆర్కే భవన్‌లో పనిచేసే ఆయా ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, సిబ్బందిని ఐడీ కార్డులు చూసి సంబంధిత శాఖలు ఉన్న ప్రాంతాలకు పంపించారు. మిగతావారిని ఎవరినీ భవన్‌లోకి అనుమతించలేదు. కేసీఆర్ రాక నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు హడావిడి చేశాయి. కేసీఆర్ జిందాబాద్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఒకానొక సందర్భంలో పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో కొంత మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని నగరంలోని ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

# తలతాకట్టు పెట్టయినా.. సంక్షేమ ఫలాలు అమలు చేస్తాం

ములుగు :అమృత్ తెలంగాణ: ఇందిరమ్మ రాజ్యమంటే రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యమని, గత పాలకులు చేసిన అప్పులను తీర్చుకుంటూనే తల తాకట్టు పెట్టయినా సంక్షేమ ఫలాలను అమలు చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖమంత్రి దనసరి సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా ఇంచర్ల గ్రామం లోని ఇందిరమ్మ కాలనీలో 23మంది లబ్దిదారులకు ఇందిర మ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేయడమే కాకుండా ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో మంత్రులు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ములుగు నియోజకవర్గానికి 3వేల ఇండ్లు మంజూరు కాగా ఐటీడీఏకు మరో 1500 ఇండ్లు మంజూరయ్యాయని, తాను మరో వెయ్యి ఇండ్లను మంజూరు చేస్తున్నామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్దిదారులకు వెంటనే



ఉచితంగా ఇసుక కోసం కూపన్లను అందజేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అటవీశాఖ అధికారులు సైతం ఇండ్ల నిర్మాణ పనులను అడ్డుకోవద్దని అన్నారు. రానున్న రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు తమకు అండగా ఉండాలని కోరారు. జిల్లాను పూర్తిస్థాయిలో పర్యాటక ప్రాంతంగా మార్చడానికి నిధులు కేటాయించినట్టు చెప్పారు. రూ.70కోట్లతో రామప్పలో పనులు చేపట్టడమే కాకుండా రూ.30 కోట్లతో ఐలాండ్ అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. ప్రతి మహిళ.. మహిళా సంఘాల్లో చేరి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని పొంది పలు రకాల వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఇక్కడి ప్రాంతంలోని మహిళలకు ఇతర ప్రాంతాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన బొంగు చికెన్‌పై శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. ములుగు జిల్లాలోని టేకులగూడెం అనే చిన్న ప్రాంతంలో కూడా స్వయంగా మంత్రుల ద్వారా ఇందిరమ్మ గృహాల శంకుస్థాపన జరగడం ప్రజల్లో ప్రభుత్వం పట్ల ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని అన్నారు. ఏజెన్సీ ప్రజలను దృష్టిలో ఉంచుకొని కేవలం 140 గృహాలు ఉన్న చిన్న గ్రామానికి కూడా ప్రత్యేక వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి నీరు అందించిన ఘనత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రవి చందర్, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో భారీ తిమింగలం

అమృత్ తెలంగాణ: : రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలకు మరో భారీ అవినీతి తిమింగలం చిక్కింది. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు విధుల్లో ఉన్న ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) నూనె శ్రీధర్‌బాబుకు చెందిన కోట్లాది రూపాయల అక్రమాస్తుల చిట్టాను ఏసీబీ అధికారులు బయటపెట్టారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ ఈఈగా ఉన్న శ్రీధర్‌బాబు అక్రమాస్తు లపై బుధవారం ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు జరిపారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోని శ్రీధర నివాసాలు, విల్లాలు, వ్యవసాయ భూములు, కమర్షియల్ కాంప్లెక్స్‌లపై ఏసీబీకి చెందిన ప్రత్యేక టీంలు దాడులను నిర్వహించాయి. ఏసీబీ డైరెక్టర్ జనరల్ విజరు కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విధి నిర్వహణలో అవినీతి, అక్రమాలకు పాల్పడి శ్రీధర్ భారీ ఎత్తున అక్రమాస్తులు సంపాదించినట్టు ఏసీబీకి సమాచారం అందింది. దీంతో షేక్‌పేట్‌లోని ఫ్లాట్, అమీర్‌పేట్‌లోని భారీ కమర్షియల్ కాంప్లెక్స్, శివార్లలోని విల్లాపై మొదట ఏసీబీ అధికారులు దాడి నిర్వహించి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, వరంగల్, కరీంనగర్‌లలోని విలువైన ప్రాంతాల్లో కూడా 19 ఓపెన్ ప్లాట్లతో పాటు 16 ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు కనుగొన్నారు. అలాగే, మరికొన్ని ఫ్లాట్స్ కూడా బయట పడ్డాయి. శ్రీధర్‌బాబు నివాసంలో భారీ మొత్తంలో నగలు, నగదుతో పాటు మరికొన్ని బ్యాంకులలోని లాకర్లను కూడా తెరిచి అందులో నుంచి



భారీ ఎత్తున నగదు, నగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి మార్కెట్ విలువ రూ.100 కోట్ల పైనే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో శ్రీధర్‌ను అరెస్ట్ చేసి, ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపర్చారు. అనంతరం నిందితుడిని జైలుకు తరలించారు.

# సింగర్ మంగ్లీపై కేసు

చేవెళ్ల :అమృత్ తెలంగాణ: ప్రముఖ తెలంగాణ ఫోక్ సింగర్ మంగ్లీ చిక్కుల్లో పడింది. గాయని మంగ్లీ తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రాత్రి రంగారెడ్డి జిల్లా చేవెళ్లలోని ఈర్లపల్లి గ్రామ శివారులో ఉన్న త్రిపుర రిసార్టులో ఘనంగా పార్టీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులతో పాటు పెద్ద సంఖ్యలో యువతీ యువకులు హాజరైనట్టు సమాచారం. అయితే, ఈ పార్టీలో మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో, అప్రమత్తమైన పోలీసు ప్రత్యేక బృందాలు రిసార్టుపై మెరుపు దాడులు చేశాయి. ఈవెంట్‌కు 50 మంది హాజరు కాగా అందులో మంగ్లీ కుటుంబ సభ్యులు, సన్నిహితులు, సినిమా ఇండస్ట్రీకి చెందిన వాళ్లు ఉన్నారు. అనుమతి లేకుండా ఈవెంట్ నిర్వహించడంతోపాటు పర్మిషన్



లేకుండా మద్యం వాడకంపై మంగ్లీతో పాటు రిసార్ట్స్ అసిస్టెంట్ మేనేజర్ శివ రామకృష్ణ, ఈవెంట్ మేనేజర్ దున్నే మేఘరాజు, దామోదర్‌రెడ్డి, సత్యవతి అలియాస్ మంగ్లీపై చేవెళ్ల పోలీసులు ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పార్టీలో ఖరీదైన మద్యం సీసాలు లభ్యమైనట్టు సమాచారం. దాంతో పార్టీలో ఉన్న 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఒకరికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలినట్టు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనతో తెలుగు సినీ పరిశ్రమలో మరోసారి మాదకద్రవ్యాల వాడకంపై చర్చ మొదలైంది. పోలీసులు ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. పార్టీ నిర్వాహకుల పాత్రపై సైతం పోలీసులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్రమంత్రే అడ్డు

న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ:తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ప్రతి ప్రాజెక్ట్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ ఏం చెబుతారో, కిషన్‌రెడ్డి అదే అమలు చేస్తున్నారని అన్నారు. కిషన్ రెడ్డి, కేసీఆర్‌ను వేరేలా చూడలేమని తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డిని కలిసినట్టు చెప్పారు. కానీ తెలంగాణ నుంచి క్యాబినెట్ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఏనాడైనా రాష్ట్ర అభివృద్ధి అంశాలపై రివ్యూ చేపట్టారా? అని ప్రశ్నించారు. ఆయన రాష్ట్ర ప్రాజెక్టలను ప్రతిపాది ంచకపోవడం వల్లే ఏ ప్రాజెక్ట్ రావడం లేదన్నారు. క్యాబినెట్ కన్నా ముందు కనీసం ప్రధాని మోడీ దగ్గరైనా తెలంగాణ అంశాలను లేవనెత్తారా? అని అడిగారు. మూడు రోజుల ఢిల్లీ పర్యటన ముగింపునకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి తుగ్లక్‌రోడ్‌లోని తన అధికారిక నివాసంలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. చెన్నైకి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, బెంగళూరుకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిలు మెట్రోరైళ్లను తీసుకెళ్లారని గుర్తు చేశారు. మరి తెలంగాణకు కిషన్‌రెడ్డి ఎందుకు మెట్రోరైల్ విస్తరణ అనుమతులు తీసుకురాలేకపోతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ వ్యతిరేకిస్తున్నందుకే, కిషన్‌రెడ్డి మెట్రోరైల్ తీసుకెళ్లడం లేదని ఆరోపించారు. వరదలు వస్తే రూపాయి కూడా తేలేదని, మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన ప్రాజెక్ట్, ట్రిపుల్ ఆర్ ఇలా ఏదీ తేలేదన్నారు. అయితే దేవుడిచ్చే వాటికి తానే యజమాని అన్నట్టు.. ప్రాసెస్‌లో భాగంగా వచ్చే వాటిని తానే తెచ్చినట్టు చెప్పుకుంటున్నారని విమర్శించారు. తాను ప్రధానిని కలిస్తే తప్పు పడుతోన్న కిషన్‌రెడ్డి తెలంగాణకు సంబంధించిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలతో రాష్ట్ర ప్రాజెక్టలపై కిషన్ రెడ్డి ఎందుకు ప్రధానిని కలిసి కోరడం లేదన్నారు. కిషన్ రెడ్డి రివ్యూ చేస్తా అంటే తెలంగాణ అధికారులందరినీ తీసుకొని ఢిల్లీ వస్తానని సవాల్ విసిరారు. గతంలో ప్రధాని మోడీ తనకు ఇచ్చిన పెండింగ్ ప్రాజెక్ట్ లపై రివ్యూ చేసి అన్నింటినీ పరిష్కరించినట్టు తెలిపారు. ఇందులో బీబీనగర్ ఎయిమ్స్ విషయంలో చాలా వేగంగా స్పందించారని కేంద్ర మంత్రి గడ్కరీ స్వయంగా తనకు ఫోన్ చేసి మెచ్చుకున్నారని చెప్పారు.

హైదరాబాద్ కలెక్టర్ నే స్వయంగా పంపా

కులగణన కోసం ఎవరూ తన ఇంటికి రాలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను సీఎం తోసిపుచ్చారు. డోర్ టూ డోర్, టోల్ ఫ్రీ, ఆన్‌లైన్, ఇతర పద్ధతుల్లో ప్రజలకు ఎన్‌రోల్ చేసుకునే అవకాశం కల్పించామన్నారు. సర్వే ద్వారా ఫైనల్‌గా 97 శాతం రికార్డ్స్ సేకరించామన్నారు. కేసీఆర్, కిషన్‌రెడ్డి, హరీశ్‌రావు, కేటీఆర్,



ఇతర గ్రేటర్ పరిధిలోని ముఖ్యనేతల వివరాలను హైదరాబాద్ కలెక్టర్ నేరుగా వెళ్లి నమోదు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. కానీ వీరందరూ రాజకీయంగా కులగణన సర్వేకు దూరంగా ఉన్నారని విమర్శిం చారు. నిజంగా కిషన్‌రెడ్డి ఎన్‌రోల్ చేసుకోవాలనుకుంటే కనీసం టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసినా సరిపోయేదన్నారు. డేటా ప్రైవసీ యాక్ట్ ప్రకారం ఈ సర్వే డేటాను భద్రంగా ఉంచినట్టు చెప్పారు.

కర్నాటకలో తెలంగాణ కులగణన మోడల్ అమలు

కర్నాటకలో తెలంగాణ కులగణన మోడల్ అమలు కోసం ఢిల్లీ వచ్చినట్టు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తన దగ్గర ప్రస్తుతం 12 శాఖలు ఉన్నాయని, హైదరాబాద్‌కు వెళ్లగానే మిగితా మంత్రుల దగ్గర ఉన్న శాఖలపై రివ్యూ నిర్వహిస్తానని తెలిపారు. మొదట తన దగ్గర ఉన్న శాఖలను కొత్త వారికి ఇవ్వాలని యోచిస్తున్నట్టు చెప్పారు. మిగితా మంత్రులు కూడా తమ వద్ద ఉన్న శాఖలతో పని భారంగా ఉందని భావిస్తే%ొ% ఎవరికి ఏయే శాఖలు కేటాయించాలనే దానిపై నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నోళ్లకు పదవులు దక్కుతాయన్నారు. అయితే తన ఇంట్లో ఎవరూ యాక్టీవ్ పాలిటిక్స్‌లో లేరని అందుకే ఎవరికీ అవకాశం దక్కలేదన్నారు.

సర్వే ఆధారంగానే తాజా మంత్రి వర్గ విస్తరణ

రికమెండేషన్ల ప్రకారం క్యాబినెట్ విస్తరణ చేపట్టలేదని కులసర్వే డేటా ఆధారంగానే ప్రస్తుతం తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ చేసినట్టు సీఎం చెప్పారు. కేసీఆర్ ఆరు నెలలు ఒక్క మంత్రిని నియమించకపోయినా ఎవరూ ప్రశ్నించలేదన్నారు.

# పీఎన్‌బీతో సింగరేణి ప్రమాదబీమా ఒప్పందం

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: సింగరేణి కాలరీస్ సంస్థ తమ ఉద్యోగులకోసం పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)తో రూ.1 కోటి 25 లక్షల ప్రమాద బీమా ఒప్పందం చేసుకుంది. బుధవారంనాడిక్కడి సింగరేణి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ బలరాం పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈఓ అండ్ ఎమ్‌డీ అశోక్‌చంద్రతో ఈ మేరకు ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందినప్పుడు కంపెనీ ఇస్తున్న సహాయం కొంత ఉన్నప్పటికీ, వారి కుటుంబాలకు మరింత ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో బ్యాంకులతో మాట్లాడి ఈ తరహా ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే సింగరేణి కార్మికులకు సాధారణ మరణం సంభవించినా, వారికి



రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్‌ను కూడా పీఎన్‌బీ అమలు చేస్తున్నదని వివరించారు. సింగరేణి పొరుగు సేవల ఉద్యోగుల కోసం రూ.40 లక్షల ప్రమాద బీమా ఒప్పందాన్ని కూడా అమలు చేస్తున్నదని వివరించారు. సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణ చర్యలు చేపడుతున్నదనీ, సోలార్ విద్యుత్తు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎలక్ట్రిసిటీ తదితర రంగాల్లోకి ప్రవేశిస్తుందని చెప్పారు. పీఎన్‌బీ సీఈవో అండ్ ఎమ్‌డీ అశోక్‌చంద్ర మాట్లాడుతూ సింగరేణితో తాము కుదుర్చుకున్న ఒప్పందం ఇతర సంస్థలకు కూడా ఆదర్శప్రాయంగా ఉంటుదన్నారు. ఈ తరహా ఒప్పందాలను ఇతర శాఖలకు కూడా విస్తరిస్తామన్నారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్ ఎల్వీ సూర్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్డీఎమ్ సుభాని, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ ఎన్వీ రాజశేఖర్‌రావు, పీఎన్‌బీ హైదరాబాద్ రీజినల్ చీఫ్ జనరల్ మేనేజర్ సునీల్‌కుమార్ చుగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆష్ట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన ఎలాంటి జాప్యం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరగాలి:ఎంపీడీఓ శివకుమార్,






అష్ట లో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసిన ఎంపీడీవో

నిర్మల్ జిల్లా ముధోల్ జూన్ 11 అమృత్ తెలంగాణ ముధోల్ మండలంలోని ఆష్ట, గ్రామ పంచాయితీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీఓ శివకుమార్, ముగ్గు వేసి శంఖుస్థాపన చేశారు.మిగతా ఇండ్లకు కూడా ఇంకా మూడు రోజులలో ప్రారంభిస్తామని,నిరుపేదల కోసం ప్రభుత్వం చేపట్టిన మహోన్నత కార్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఒకటని ఇందులో ఎలాంటి అవకతవకలకు పాల్పడేది లేదని ఒకవేళ అలా జరిగినట్లయితే కఠిన చర్యలు తప్పవని సూచించారు.ఆష్ట గ్రామంలో మొత్తం నలభై మూడు ఇండ్లు మంజూరు కాగా ఈ రోజు ఐదు ఇండ్లకు శంఖు స్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ ఏఈ శ్రీకాంత్,గ్రామ సెక్రటరీ గంగాధర్ తో పాటు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు రావుల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సుర్గుల సునీత పోశెట్టి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గానికి మూడు విద్యుత్ సబ్ స్టేషన్ ల మంజూరు 7 కోట్ల 50 లక్షల రూపాయల నిధులతో కోలూర్, మహాగాం, పల్సి లో సబ్ స్టేషన్ ల ఏర్పాటు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

నిర్మల్ జిల్లా బైంసా జూన్ 11 అమృత్ తెలంగాణ ముధోల్ నియోజకవర్గం రైతాంగానికి, ప్రజానీకానికి విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండాలన్న ఉదేశ్యం తో నియోజకవర్గంలోని కోలూర్, మహాగాం, పల్సి లో విద్యుత్ సబ్ స్టేషన్ ల నిర్మాణానికి 7 కోట్ల 50 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు. బుధవారం ఆయన హైదరాబాద్ నుండి ఫోన్లో మాట్లాడారు. ప్రభుత్వానికి పలుమార్లు సమస్యను విన్నవించడంతో నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. రైతుల ఎన్నో ఏళ్ల సమస్య విద్యుత్ సబ్టేషన్ల ఏర్పాటు మూలంగా తొలగిపోతుందన్నారు. కోలూరులో సబ్టేషన్ ఏర్పాటుకు రెండు కోట్ల నలభై లక్షల రూపాయల నిధులు, మహాగంలో సబ్టేషన్ ఏర్పాటుకు రెండు కోట్ల నలభై లక్షల రూపాయల నిధులు, పల్సి లో సబ్టేషన్ ఏర్పాటుకు రెండు కోట్ల 38 లక్షల రూపాయల నిధులు మంజూ రు కావడం జరిగిందని చెప్పారు.



సబ్ స్టేషన్ల మంజూరి ప్రొసిడింగ్స్ ను చూపుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

## భూభారతి చట్టం అమలుతో భూ సమస్యల పరిష్కారం.

### ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వి గ్రామంలో నిర్వహించిన భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి భూ సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. అవసరమైతే అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. పునరావాస గ్రామమైన సాంగ్వికి రెవెన్యూ మ్యాప్ అందుబాటులో లేకపోవడంతో గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, త్వరితగతిన మ్యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భూభారతి సదస్సులను పూర్తిస్థాయిలో వినియోగించుకొని తమ భూ సమస్యలపై దరఖాస్తులు సమర్పించుకోవాలని ప్రజలకు కలెక్టర్ సూచించారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. విద్యార్థుల సంఖ్య, తరగతి గదులు, యూనిఫామ్, పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తున్నందున విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆ తరువాత అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. చిన్నారులు పూలమొక్కలతో కలెక్టర్‌కు స్వాగతం పలికారు. ప్రతి అంగన్వాడీలో ఆకర్షణీయమైన పెయింటింగ్స్, బొమ్మలు, సరైన విద్యా వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్లాక్ బోర్డుపై చిన్నారులతో ఆంగ్ల అక్షరాలు చదివించారు. పిల్లల నైపుణ్యాలను ప్రశంసించారు. మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలన్నారు. కలెక్టర్ స్వయంగా చిన్నారులకు ఎగ్ బిర్యానీ వడ్డించారు. తల్లిదండ్రులతో మాట్లాడుతూ అంగన్వాడీల్లో పిల్లల ఆరోగ్యం, అభివృద్ధి కోసం నాణ్యమైన ఆహారం అందుతున్నదని, తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. అనంతరం బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఈఓ పి. రామారావు, తహసిల్దార్ ఎజాజ్, ఎంపీడీఓ అరుణ, రెవెన్యూ, విద్యాశాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





వంట సామాగ్రి పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ లలో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం దిలావర్‌పూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల మైదానం, తరగతి గదులు, వంటగది, నిల్వ గది (స్టోర్‌రూమ్), కుళాయిలు తదితర సదుపాయాలను పరిశీలించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థుల సంఖ్య, విద్యా ప్రమాణాలు, నిర్వహణ అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రేపటి(12.06.2025) నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానుండటంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు పాఠశాలల పరిశుభ్రత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ పరిశీలనలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు, కేజీబీవీ ల పర్యవేక్షకురాలు సలోమి కరుణ, అధికారులు లింబాద్రి, ప్రవీణ్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన విత్తన చట్టం రూపకల్పనకు కృషి :తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి



సమావేశంలో హాజరైన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్: నూతన విత్తన చట్టం -2025 రూపకల్పనలో రైతుల సూచనలు తీసుకొని త్వరలో అమలులోకి వచ్చేలా చర్యలు చేపడతామని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్యామాలదేవి,కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డితో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన విత్తన చట్టం-2025 ముసాయిదా తయారి కోసం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు, జిల్లాకు చెందిన వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్ ఆర్గనైజర్లు, విత్తన కంపెనీ ప్రతినిధులు, డీలర్లు, రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధి ఈవిత్తన చట్టం ముసాయిదా కమిటీని ఏర్పాటు చేయడంతో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. అందరి సూచనలు సలహాలు పరిగణలోకి తీసుకుని విత్తన చట్టం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.

## రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డికి ఘనంగా సన్మానం



అన్వేష్ రెడ్డి సన్మానిస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : విత్తన చట్టం ముసాయిదా కమిటీ సమావేశానికి గాను ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు సుంకెట అన్వేష్ రెడ్డి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వగతం పలికి శాలువాతో సన్మానించడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సీసీ హాల్లో నిర్వహించిన విత్తన చట్టం ముసాయిదా కమిటీ సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా రైతులు, విత్తన డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు మరియు రైతు అనుబంధంగా ఉన్న ప్రతినిధులతో కమిటీ సంప్రదింపులు నిర్వహించింది. విత్తన చట్టానికి సంబంధించి వారి అభిప్రాయాలు, సూచనలు సేకరించడం జరిగింది. సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మల్లేష్, కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తడిసెన వెంకట్ రెడ్డి ,కిసాన్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ కొండ గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ రహీం ఖాన్,నలిమేలా నవీనరెడ్డి మావల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుదురుపాక సురేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## రాష్ట్ర క్యాబినెట్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసిన నిర్మల్ జిల్లా మాల మహానాడు నాయకులు.






మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామిని కలిసిన నిర్మల్ జిల్లా మాల మహానాడు నాయకులు

నిర్మల్ జిల్లా జూన్ 11 అమృత్ తెలంగాణ బుధవారం రోజు నిర్మల్ జిల్లా మాల మహానాడు నాయకులు ఇటీవల తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో రాష్ట్ర కేబినెట్ మినిస్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొట్టమొదటిసారిగా హైదరాబాదులోని రాజ్ భవన్ పక్కన గల రాష్ట్ర కేబినెట్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్వగృహంలో గడ్డం వివేక్ వెంకటస్వామి ని కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా నాయకులు కుంటోల్ల వెంకటస్వామి, బత్తుల రంజిత్, బొడ్డు లక్ష్మణ్, ఎలుమల రాజేశ్వర్, నిర్మల్ మండల నాయకులు అడ్డిగా బోస్, ఆకుల రమేష్, మామడ మండల నాయకులు తలారి రాజేశ్వర్, కప్ప కంతి సురేష్, అలుగునూరి నరేందర్, తలారి సుదర్శన్, తలారి భూమన్న, లక్ష్మణచందా మండల నాయకులు గోలి గంగాధర్ నిర్మల్ పట్టణ నాయకులు పులి రమేష్, బైంసా మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కవ్వాల్ టైగర్ జోన్ అడవుల్లో అడవి బర్రెలు..



జన్నారం: అమృత్ తెలంగాణ: జన్నారం అటవీ రేంజ్ పరిధిలో అడవి బర్రెలు పర్యాటకులకు కనువిందు చేశాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ రేంజ్ పరిధిలోని బైసన్కుంట, తదితర ప్రాంతాలు పచ్చదనం సంతరించు కున్నాయి. ఆ ప్రాంతాలను చూసేందుకు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. వారు వెళ్తున్న సమయంలో అభయారణ్యంలో అడవి బర్రెలు గుంపులుగా తిరుగుతూ కనిపించాయి. దీంతో అడవి బర్రెలు జింకలు దుప్పులు, కుందేళ్ళని చూసి పర్యాటకులు ఎంతో ఆనందపడ్డారు.

# సిఎంఆర్ డెలివరీ ప్రక్రియ వేగవంతం చేయండి. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



హాజరైన రైస్ మిల్లర్స్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) డెలివరీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో సిఎంఆర్ డెలివరీ పై అధికారులు, రైస్ మిల్లర్లతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. మిల్లుల వారీగా కేటాయించిన ధాన్యం, ఇప్పటివరకు అప్పగించిన బియ్యం తదితర వివరాలను అధికారులు కలెక్టర్ తెలుసుకున్నారు. సిఎంఆర్ డెలివరీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి దశలో ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి రోజూ డిప్యూటీ తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా డెలివరీ పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. సిఎంఆర్ డెలివరీలో ఆలస్యం చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని సూచించారు. కేటాయించిన అంచనాలను వేగంగా డెలివరీ పూర్తి చేసిన మిల్లర్లకు ముున్ముందు అధికంగా ధాన్యం కేటాయిస్తామని తెలిపారు.

ఆలస్యం చేస్తున్న మిల్లర్ల ఆస్తులను బ్లాక్ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, మేనేజర్ సుధాకర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్, రైస్ మిల్లర్స్, తదితరులు పాల్గొన్నారు.

# ఎడ్ల బండి ఎక్కి... అరక దున్నిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

## ప్రారంభించిన పొలంబాట పనులను పరిశీలించడం జరిగింది





ఎడ్ల బండి ఎక్కిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ గ్రామీణ న్యూస్ : రోడ్లు సరిగ్గా లేని కారణంగా వర్షాకాలం పూర్తిగా బుర్దల్లో తమ తమ చేలల్లోకి పోవాలంటే నెత్తిపై ఎరువులు పెట్టుకొని పోతే గాని చేన్లోకి వెళ్లి వ్యవసాయం చేసే పరిస్థితి లేదు అన్ని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకరన్నారు. పొలం బాట కార్యక్రమంలో భాగంగా యాపల్ గూడా గ్రామంలో బుధవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. ముందుగా ఎడ్ల బండి ఎక్కి... అనంతరం అరకదున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత శాసనసభ సమావేశాల్లో రైతులు పడుతున్నటువంటి కష్టాన్ని, ఇబ్బందులను ప్రభుత్వం ఆలోచించాలని సీఎం రేవంత్ రెడ్డిని విన్నవించడం జరిగిందన్నారు. రైతులు పండించిన పంటను నేరుగా తన చేను నుంచి మార్కెట్ కు తరలించే పరిస్థితి రావాలన్నారు. ఆ చేను వరకు రోడ్డు సౌకర్యం ఉంటేనే సాధ్యం కాదన్నారు. మార్కెట్లోని నాలుగు బస్తాలు వేసుకొని ఆ బస్తాలు నేరుగా రైతు పొలం దగ్గరికి వెళ్ళేటట్టు రోడ్డు సౌకర్యం ఉండాలన్నారు. వర్షాకాలంలో ఒక్కొక్కసారి బురదలో ఎడ్ల బండి దిగి ఉండి ఉంటే వెళ్లే పరిస్థితి అన్నారు. ఆ రకమైన బాధ నుంచి విముక్తి కలగాలని పొలం బాటని కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఆదిలాబాద్ రైతుల తరఫున, రాష్ట్ర రైతుల తరఫున దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారిని తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డికి . మంత్రి సీతక్క కలెక్టర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి ఉపయోగపడే విధంగా ప్రస్తావించినందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేసినందుకు శాసన సభ్యునిగా సంతోషపడుతున్నానన్నారు. కూలీలు చేల్లో పనికిరావాలనా నాలుగైదు కిలోమీటర్ నడుచుకుంటూ పోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఆటోలు చేనులకు వస్తేనే గాని కూలీలు పనికి వచ్చే పరిస్థితి లేదన్నారు. నిధులు లేక ప్రభుత్వం ఇబ్బందులలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారం ఇవ్వండి, రాష్ట్ర ప్రభుత్వం కూడా సహాయం చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారన్నారు. మనందరికీ అన్నం పెట్టే రైతన్న బాధను మనమందరం సానుకూల దృక్పథంతో అర్థం చేసుకోవాలన్నారు. గ్రామాలకు రోడ్లు ఎంత అవసరమో. అంతే పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం అవసరమన్నారు.. ఈ కార్యక్రమంలో అధికారులు మండల నాయకులు సంతోష్ లింగు పటేల్ బొచ్చన్న ఉమేష్ నరేష్ నరేష్ . అశోక్ రెడ్డి.

# రైతులకు రైతు భరోసా ఇచ్చి, రుణమాఫీ చేయాలి




అచ్చంపేట :అమృత్ తెలంగాణ: రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని, రైతు భరోసా అమలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అచ్చంపేట మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినపత్రాన్ని కార్యాలయం సిబ్బందికి ఇచ్చారు. ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దేశనాయక్ హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలను ప్రలోభాలకు గురిచేసి ఎన్నో హామీలను ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం, నాయకులు, మంత్రులు, పూర్తిగా విస్మరిస్తున్నారని ఆరోపించారు. రైతు భరోసా పథకం ద్వారా రైతులకు ఎన్నో ఆశలు కల్పించారు. కానీ అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప, రైతులకు చేసింది ఏమీ లేదన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్నా నేటికీ రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేకుండా ఉన్న పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నది అన్నారు. బ్యాంకుల ద్వారా రైతులకు సాగు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలకుల వల్ల బ్యాంకర్లు రైతులపై నిర్లక్ష్యం చూపుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రైతాంగ సమస్యలు పరిష్కరించకపోతే ప్రజల్ని రైతులని సమీకరించి, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని దేశనాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వర్గం సైదులు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బి. రాములు, శివకుమార్, పర్వతాలు, వెంకటయ్య, బక్కయ్య, పర్వతాలు, తిరుపతయ్య,వెంకటమ్మ, రజిత, లక్ష్మి, సాగర్, వి నాయక్, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

# నాగలి పట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్ ..



హుస్నాబాద్ రూరల్ :అమృత్ తెలంగాణ: ఈసారి మంచి వర్షాలుకురుస్తాయని తెలంగాణ రాష్ట్రం దేశంలో ఉత్పత్తులు ఎగుమతి చేసే రాష్ట్రంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలంలోని పందిళ్ళ గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఎడ్లతో నాగలి దున్ని రైతులతో కలిసి పెసర విత్తనాలు చల్లారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతు సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. రైతులు ఒక్క గుంట కూడా బీడు లేకుండా వరి, మొక్కజొన్న , ఆయిల్ ఫాం ఇతర ఏదైనా పంటలు వేయాలని కోరారు. రైతులు ఎక్కడ ఖాళీ జాగా బీడు లేకుండా చూడాలన్నారు. రైతులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్, సాగునీరు, పెట్టుబడి సహాయం, మద్దతు ధర అందిస్తుందన్నారు. రైతులకు ఏ ఇబ్బంది లేకుండా రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉండే ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం అన్ని రాజకీయ మిత్రులు అధికారులు ఎక్కడ ఖాళీ స్థలం లేకుండా చూసుకోవాలన్నారు. విత్తనాలు వేసుకునే శక్తి లేని వారికి మా కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. హుస్నాబాద్ లో మూడు రోజుల పాటు రైతు మహోత్సవం కార్యక్రమం జరిగిందని ,ఈ ప్రాంత రైతాంగానికి వ్యవసాయ విధానాలు పద్ధతులపై మూడు రోజుల కాన్ఫరెన్స్ జరిగిందన్నారు. పంటలు ,యాంత్రీకరణ తదితర అంశాలపై రైతులు అవగాహన చేసుకున్నాట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ బంక చందు, మడప జైపాల్ రెడ్డి , వెన్నె రాజు, పోలు సంపత్, వ్యవసాయ శాఖ అధికారులు ఏ డి ఏ శ్రీనివాస్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యజమానిని తన సొంత స్థలంలో రానీయకుండా అడ్డుకుంటూ చంపేస్తామని బెదిరించిన వారిపై కేసు నమోదు - మావల సీఐ ఎస్ హెచ్ ఓ కె స్వామి.

**స్థానిక విద్యా సంస్థ చైర్మన్ ఫోర్జరీ, ప్రాణాపాయం మరియు ఆస్తిపై బెదిరింపులు**
**తన పేరుపై అబద్ధపు పత్రాలను, నకిలీ పత్రాలను సృష్టించి ఫోర్జరీ చేశారనే ఇదివరకే కేసు నమోదు.**
**పట్టణంలోని డాక్టర్ ప్రకాష్ ఫిర్యాదు మేరకు వకలాభరణం**
**ఆదినాథ్, జి స్వామి, ఆర్ అమరేందర్లపై కేసు నమోదు, విచారణ.**




మావల సి ఐ కే స్వామి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఆదిలాబాద్ జూన్ 10, 2025 రోజున శ్రీ సత్య సాయి విద్యానికేతన్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ జి. ప్రకాష్ గారు నేడు మవాలా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదు చేశారు. ఇందులో ఆయన బట్టి సవర్గం గ్రామం, మవాలా మండలంలో ఉన్న భూమి మరియు పాఠశాల నిర్వహణకు సంబంధించి జరిగిన నకిలీ పత్రాలు, క్రిమినల్ కుట్ర, మరియు తన ప్రాణం మరియు ఆస్తిపై బెదిరింపులపై పలువురిపై ఆరోపణలు చేసారు. డాక్టర్ ప్రకాష్ తెలిపిన మేరకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూలై 31, 1999న జారీ చేసిన జీవో నెం. 602 ద్వారా బట్టిసావర్గావ్ గ్రామం, సర్వే నం. 72లోని 13.31 గుంటల భూమిని శ్రీ సత్య సాయి విద్యా విహార్ సంస్థకు విద్యా సంస్థ స్థాపన కోసం అప్పగించిందని పేర్కొన్నారు. అనంతరం ఆ భూమికి తానే హక్కుదారుడిగా మారినట్లు తెలిపారు. ఇద్దరి మధ్య ఒప్పందం ప్రకారం, దాదాపు 20 సంవత్సరాల క్రితం ఆ భూమిలో 5 ఎకరాల మేరకు శ్రీ సత్య సాయి విద్యా నికేతన్ పాఠశాలను నిర్మించారు. ఆ పాఠశాలకి మవాలా గ్రామ పంచాయతీ ద్వారా డోర్ నంబరు 6-248/1 కేటాయించబడింది. 2014 మేలో తన వృత్తిపరమైన బిజీ షెడ్యూల్ కారణంగా, పాఠశాల నిర్వహణ బాధ్యతలను జి. స్వామి అనే వ్యక్తికి అప్పగించారని తెలిపారు. అయితే, పాఠశాల ఆదాయంలో 20 శాతం ఇవ్వాలని ఒప్పుకున్నప్పటికీ, జి. స్వామి పాఠశాల ఖర్చులపై సరైన లెక్కలు ఇవ్వలేదని ఆరోపించారు. ఫిర్యాదులో, జి. స్వామి, వి. ఆదినాథ్, ఆర్. అమరేందర్ అనే వ్యక్తులు న్యాయపరమైన స్టాంప్ పేపర్లపై తన సంతకాలు ఫోర్జరీ (నకిలీ) చేసి అబద్ధపు లీజు డీడ్ తయారు చేశారని పేర్కొన్నారు. 2025 మే 2న పాఠశాల ప్రాంగణాన్ని సందర్శించినప్పుడు, డాక్టర్ ప్రకాష్‌ను జి. స్వామి, అతని భార్య, కుమార్తె మమత, వి. ఆదినాథ్ మరియు అతని కుటుంబ సభ్యులు, అలాగే ఆర్. అమరేందర్ మరియు ఇతర అనుచరులు అడ్డగించి గొడవపడి తీవ్రంగా బెదిరించారని ఆరోపించారు. తనను మరియు తన కుటుంబ సభ్యులను చంపిస్తామని హెచ్చరించారని అన్నారు. ఈ నేపథ్యంలో, మవాలా పోలీసులు Cr. No. 270/2025, U/Sec: 126(2), 351(2) r/w 3(5) BNS ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డాక్టర్ ప్రకాష్ తగిన చట్టపరమైన చర్యలు తీసుకొని తన ప్రాణం మరియు ఆస్తిని రక్షించాలంటూ విజ్ఞప్తి చేశారని మావలా సిఐ కె స్వామి తెలియజేశారు.

# మైనర్ అబ్బాయి ని అక్రమంగా నిర్బంధించి, కిడ్నాప్ చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు.

**ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు విచారణ.**
**ఎలాంటి సమాచారమైన పోలీస్ యంత్రాంగానికి తెలియజేయాలి.**
**చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తప్పవు.**
**ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి.**




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి వివరాలలో మొదటి కేసు జైనథ్ మండలంలోని ఒక మైనర్ అమ్మాయిని ఆదిలాబాద్ చెందిన ఒక మైనర్ అబ్బాయి ఫోన్ ద్వారా అమ్మాయికి మెసేజ్లు పెడుతూ, ప్రేమ పేరుతో వేధిస్తున్న ఘటన నందు అబ్బాయిపై జైనథ్ పోలీస్ స్టేషన్ నందు పోక్సో కేసు నమోదు అయినదని ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. రెండవ కేసు ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో నమోదు అయింది. ఈ ఘటన నందు మొదటి కేసు నందు నిందితుడు మైనర్ అబ్బాయిని ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు రాళ్ల బండి మహేందర్, పద్మావార్ రాకేష్ మరియు గంద్రత్ నరేందర్ లు ఆ కేసులో నిందితుడైన మైనర్ అబ్బాయిని ఆదిలాబాద్ మున్సిపల్ పార్క్ ద్వారకా నగర్ వద్ద పిలిచి అతని వద్ద నుండి మొబైల్ ఫోన్ లాక్కొని అతనిని, అక్రమంగా నిర్బంధించి, అమ్మాయిని కావాలనే వేధిస్తున్నావు అంటూ, లవ్ జిహాద్ చేస్తున్నావు అంటూ అనడం జరిగిందని, అతనికి ఇష్ట వ్యతిరేకంగా వాహనంలో కూర్చోబెట్టి ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్కు తీసుకువెళ్లడం తో బాధితుని ఫిర్యాదు మేరకు ఈ ముగ్గురిపై ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో బలవంతపు అక్రమ నిర్బంధం, కిడ్నాప్, ఫోన్ స్నాచింగ్ సెక్షన్ల కింద కేసు నమోదు చేయబడ్డాయని ఆదిలాబాద్ డిఎస్పీ తెలిపారు. చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకోకూడదని ఎలాంటి సమాచారమైన పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని, చట్ట వ్యతిరేకంగా, సమాజ వ్యతిరేకంగా జరిగే వాటిపై జిల్లా పోలీసు యంత్రాంగానికి సమాచారం అందించాలని, నేరం చేసే వారిని జిల్లా పోలీసు యంత్రాంగం వదిలిపెట్టదని ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. విద్యార్థినుల, మహిళల వేధింపులకు ఆదిలాబాద్ షీ టీం బృందాలని సంప్రదించాలి లేదా అత్యవసర సమయంలో డయల్ 100 ని వినియోగించుకోవాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండని మైనర్ అమ్మాయిలకు ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేసిన, సోషల్ మీడియా నందు మెసేజ్లు చేసి వేధించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని, పోక్సో కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరం



అచ్చంపేట :అమృత్ తెలంగాణ: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ, కందూరు రామ్ రెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరము నిర్వహించారు. శిబిరాన్ని డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తారాసింగ్ ప్రారంభించారు. 68 మందికి కంటి రోగులను పరీక్షించి వీరిలో 52 మందికి కంటిశుక్లాలు ఉన్నట్లు నిర్ధారించారు. కంటి ఆపరేషన్ నిమిత్తమై ప్రత్యేక అంబులెన్స్ లో కందూరు రామ్ రెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఆపరేషన్ పూర్తైన అనంతరం తిరిగి వాళ్ళ సొంత గ్రామాలకు ఇంటిదగ్గర వదిలిపెడుతున్నట్లు వైద్య శిబిరం సిబ్బంది తెలిపారు. ఈ శిబిర కార్యక్రమంలో రిటైర్డ్ ఆప్తాలమిక్ అధికారి సిహెచ్ గణేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# నల్లమల అడవి ప్రాంతంలో ఆరోగ్య శిబిరం




అచ్చంపేట :అమృత్ తెలంగాణ: నల్లమల అడవి ప్రాంతంలోని ఫరహాబాద్, మల్లాపూర్ పెంటలలో మంగళవారం వైద్య, ఆరోగ్య శాఖ, ఐటిడిఏ (పీఎం జన్మన్) వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా కలిసి ఫరహాబాద్, మల్లాపూర్ చెంచు పెంటలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 72 మందికి ఆరోగ్య పరీక్షలు జరిపి అవసరమైన చికిత్స అందించారు. 39 మందికి రక్త నమూనాలను సేకరించి నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ కు పంపించారు. వర్షాకాలంలో దోమకాటు వ్యాధులైన, మలేరియా డెంగు గురించి అవగాహన కలిగించి దోమలు పుట్టకుండా కుట్టకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, శుభ్రమైన నీరు, చేతుల పరిశుభ్రత గురించి అవగాహన కలిగించారు. గర్భవతుల పరీక్షల కొరకు 102 వాహన సేవలు వినియోగించుకోవలసిందిగా తెలియజేశారు. గర్భవతులు ప్రసవ తేది కంటే పది రోజులు ముందుగా అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో చేరాలని గ్రామ ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ వైద్యాధికారి కళ్యాణ్ సాగర్, శరత్ , పీఎం జన్మన్ వైద్యాధికారి డాక్టర్ సంధ్యారాణి డాక్టర్ మోతిలాల్ నాయక్, అచ్చంపేట ఉప మలేరియా అధికారి బికులాల్, డిపిఎంవో మధుమోహన్, టిపిఎం సేవియా, ల్యాబ్ టెక్నీషియన్ హరిలాల్,హెల్త్ అసిస్టెంట్ రాజేష్ పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో పాఠశాలలు పునః ప్రారంభించాలి

పెద్దవంగర :అమృత్ తెలంగాణ: నూతన విద్యా సంవత్సరాన్ని పండుగ వాతావరణంలో పాఠశాలలను పున: ప్రారంభించాలని మండల విద్యాశాఖాధికారి బుధారపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రేపటి నుంచి మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రారంభంకానున్నాయని తెలిపారు. దీని కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాల పరిసరాలను పండుగ వాతావరణంలో మామిడి తోరణాలు కట్టి విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలకాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే పాఠశాలను ప్రారంభమైన మొదటి రోజున విద్యార్థుల చేతికి యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేయడానికి అన్ని చర్యలు చేపట్టిందన్నారు. దీంతోపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నేడు పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని చెప్పారు. పాఠశాలల పునః ప్రారంభం నేపథ్యంలో తరగతి గదులు, పరిసరాలు, కిచెన్ గది, టాయిలెట్లు అన్ని శుభ్రం చేయించినట్లు తెలిపారు. సర్కారు పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గతేడాది రికార్డు స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన 30 మంది విద్యార్థులు 550 మార్కుల పైగా సాధించినట్లు వివరాలు వెల్లడించారు. భవిష్యత్తులోనూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఉన్నత విద్యలో వెయిటేజ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపి అప్పుల పాలు



కావద్దని సూచించారు. మన ఊరు- మనబడి ని మనమే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కాగా మండల వ్యాప్తంగా నేడు 5 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, 18 ప్రాథమిక పాఠశాలలు, కేజీబీవీ పాఠశాల నేడు పునః ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా నూతన విద్యా సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



మల్హర్ రావు :అమృత్ తెలంగాణ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తిసుకొచ్చిన భూ భారతి 2025 చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు రైతుల సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని వళ్లెంకుంట,మల్లంపల్లి గ్రామాల్లో మండల తహసిల్దార్ రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులను అదనపు కలెక్టర్ తనిఖీలు నిర్వహించారు. వివిధ సమస్యలపై వచ్చిన మొత్తం 405 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు ధరణి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు మేధావులు, రైతు సంఘాలు, అందరితో చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం తీసుకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# కేబుల్ ఆపరేటర్లు పోల్ టాక్స్ ను వెంటనే రద్దు చేయాలి

భూపాలపల్లి :అమృత్ తెలంగాణ: కేబుల్ ఆపరేటర్లు పోల్ టాక్స్ ను వెంటనే రద్దు చేయాలని ఇండిపెండెంట్ రాష్ట్ర ఎం ఎస్ ఓ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేషాల రమేష్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కీలకంగా పనిచేసిన ఎం ఎస్ ఓ లు కేబుల్ ఆపరేటర్ల పరిస్థితి దీనస్థితికి చేరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లుగా ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించకున్న స్వయంకృషితో కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని ప్రజలకు వినోదాన్ని అందించడంలో గాని అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలకు సంబంధించిన సమాచారం అందించడంలో కేబుల్ ఆపరేటర్లు ముందు వరుసలో ఉంటారన్నారు. ప్రస్తుత సమయంలో డిజిటల్ ప్లాట్ ఫామ్ లతో పోటీ పడడం కష్టం కష్టమవుతున్న తరుణంలో మూలిగే నక్క పై తాటిపండు పడ్డట్టు ఇప్పటికే నష్టాలలో నడుపుతున్న కేబుల్ టీవీ లపై ప్రభుత్వం టీఎస్ ఎన్పీడీసీఎల్ ద్వారా పోల్ టాక్స్ పేరుతో వాడుతున్న కరెంటు పోల్ లను లెక్కించి పోల్ టాక్స్ కట్టాలంటూ కేబుల్ టీవీ ఆపరేటర్ల పై అదనపు ఆర్థిక భారాన్ని మోపడం హేయమైనా చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే పోల్ టాక్స్ విధానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి




తీసుకెళ్లాలంటూ ఇటీవల భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును కలిసి వినతి పత్రం అందించడం జరిగిందన్నారు. అలాగే భూపాలపల్లి విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్చూర్ నాయక్ కలిసి ఆపరేటర్ల సమస్యలను వివరించి వినతి పత్రం అందించడం జరిగిందని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కేబుల్ టీవీ ఆపరేటర్లను కుటీర పరిశ్రమలు గా గుర్తించి వివిధ శాఖల ద్వారా రుణ సదుపాయం కల్పించి కేబుల్ టీవీ లను ప్రోత్సహించాలని కోరారు. కేబుల్ ఆపరేటర్ల పోల్ టాక్స్ ను తక్షణమే రద్దు చేసి ఆపరేటర్ల జీవన మనుగడకు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్లు బోట్ల రాజు ,ఓదెల సురేష్,నల్లవేని రాజు, నన్నపు సతీష్, ఒజ్జ ఐలయ్య. గట్టయ్య, దేవేందర్ లు పాల్గొన్నారు.

# జనంసాక్షి ఎడిటర్ రహమాన్ పై పెట్టిన కేసు ఎత్తివేయాలి

భూపాలపల్లి :అమృత్ తెలంగాణ: జనంసాక్షి ఎడిటర్ రహమాన్ పై అక్రమంగా పెట్టిన కేసును వెంటనే ఎత్తివేయాలని భూపాలపల్లి జర్నలిస్టులు డిమాండ్ చేశారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కాకతీయ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా కాకతీయ ప్రెస్ క్లబ్ నుండి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు సామంతుల శ్యామ్, తడుక సుధాకర్ లు మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా రాజోలు మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా గ్రామ రైతులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘటనతో ఏటువంటి సంబంధంలేని జనంసాక్షి ఎడిటర్ రహమాన్ పై అక్రమంగా కేసులు పెట్టారన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు చేసిన పోరాటాన్ని జనంసాక్షి పత్రికలో కథనాలు ప్రచురిస్తే ఫ్యాక్టరీ యాజమాన్యం తప్పుడు ఫిర్యాదు ఇచ్చి, అక్రమంగా ఎడిటర్ పై కేసులు



పెట్టారన్నారు. ప్రశ్నించే గొంతును నొక్కటం ఏమిటని మీడియా సభ్యులు మండిపడ్డారు. తక్షణమే జనంసాక్షి ఎడిటర్ రహమాన్ పై పెట్టిన కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పోతరాజు రవిభాస్కర్, చెరుకు సుధాకర్, సారేశ్వర్, తిక్క ప్రవీణ్, క్యాతం మహేందర్, విజయ్, మారపెల్లి చంద్రమౌళి, వెంకన్న, అంబాల సంపత్, రాజు, వెంకన్న, మోహన్, సమ్మయ్య, రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పిట్ట గోడ ఎక్కిన మస్త్ మస్త్ జవానీ



మరోవైపు అనన్యకు యూత్ లో ఉన్న క్రేజ్ దృష్ట్యా పాపులర్ బ్రాండ్స్ తన వెంట క్యూ కడుతున్నాయి. ఇప్పటికే పలు బ్రాండ్స్ కి అనన్య ప్రచారం చేస్తోంది. అందానికి అందం ప్రతిభతో యువతరం హృదయాలను గెలుచుకున్న బ్యూటీ అనన్య పాండే. బాలీవుడ్ లో నటవారసురాలిగా ఆరంగేట్రం చేసినా ఒక్కో సినిమాతో నటిగా పరిణతి చెందుతూ ఇప్పుడు సౌత్ లోను ఫాలోవర్స్ ని సంపాదించుకుంది. దేవరకొండ సరసన పాన్ ఇండియన్ మూవీ ఫ్లాపైనా కానీ, అనన్యకు క్రేజ్ తగ్గలేదు. సౌత్ నుంచి ఈ బ్యూటీని మరిన్ని ఆఫర్లు వరించనున్నాయి.. కానీ దానికి కొంత సమయం పట్టొచ్చు. మరోవైపు అనన్యకు యూత్ లో ఉన్న క్రేజ్ దృష్ట్యా పాపులర్ బ్రాండ్స్ తన వెంట క్యూ కడుతున్నాయి. ఇప్పటికే పలు బ్రాండ్స్ కి అనన్య ప్రచారం చేస్తోంది. ఏడాది ప్రచారానికి కోటి పైగా అందుకుంటోందని సమాచారం. ఇప్పుడు అలాంటి ఒక బ్రాండ్ ప్రచారంలో భాగంగా పిట్టగోడ ఎక్కి ఫోజులిచ్చింది. టైట్ ట్రాక్ ధరించి పిట్టగోడపై ఈ సన్నజాజి ఇచ్చిన ఫోజ్ ఇప్పుడు ఇంటర్నెట్ లో గుబులు రేపుతోంది. అనన్య ఫ్యాన్స్ ఈ ఫోటోగ్రాఫ్ ని వైరల్ గా షేర్ చేస్తున్నారు. అయ్యేదెప్పుడు బాస్! బ్రింజాల్ ట్రాక్ లో అనన్య ఒంపు సొంపులు ఒక రేంజులో ఎలివేట్ అయ్యాయంటే బోయ్స్ కితాబిచ్చేస్తున్నారు. ఇక కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఇటీవలే విడుదలైన కేసరి చాప్టర్ 2లో అనన్య పాండే నటనకు మంచి పేరొచ్చింది. బ్రిటీషర్ల పాలనలో జలియన్ వాలాబాగ్ దురంతం అనంతరం జరిగిన కోర్ట్ రూమ్ సన్నివేశాల్ని ఈ సినిమాలో అద్భుతంగా చూపించారని ప్రశంసలు కురుస్తున్నాయి. కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ ఈ సినిమాని వీక్షించి ఇప్పుడు రివ్యూ ఇవ్వడం ఆసక్తి ని కలిగిస్తోంది. అక్షయ్ కుమార్ ఈ చిత్రంలో ప్రధాన పాత్రను పోషించారు.

# థై స్లిట్ గౌనులో నటి -క్లూజివ్ భంగిమ


మంచు కాంపౌండ్ సినిమా మోసగాడులో నటించింది రూహీ సింగ్. బాలీవుడ్ టు టాలీవుడ్ ఈ భామ కాంటాక్ట్స్ ని మెయింటెయిన్ చేస్తోంది. మంచు కాంపౌండ్ సినిమా మోసగాడులో నటించింది రూహీ సింగ్. బాలీవుడ్ టు టాలీవుడ్ ఈ భామ కాంటాక్ట్స్ ని మెయింటెయిన్ చేస్తోంది. కానీ రూహీ మోడలింగ్ లో రాణించినంతగా సినిమాలతో రాణించలేదన్నది వాస్తవం. కింగ్ ఫిషర్ క్యాలెండర్ గర్ల్ గా ఫోటోషూట్లతో పాపులరైన రూహీ, ఆ తర్వాత బాలీవుడ్ లో మాధుర్ భండార్కర్ అటుపై వరస చిత్రాల్లో నటించింది. కానీ ఏవీ ఆశించిన సక్సెస్ ని ఇవ్వలేదు. .అయ్యేదెప్పుడు బాస్! చాలా కాలం తర్వాత టాలీవుడ్ లో మోసగాడు చిత్రంతో అడుగుపెట్టింది. రూహీ ఇప్పటికీ హిందీ, తెలుగు చిత్రాల్లో నటించాలని కలలు కంటోంది. కానీ ఆశించిన అవకాశాలేవీ వరించలేదు. రూహీ వెబ్ సిరీస్ లు, మ్యూజిక్ ఆల్బమ్స్ లోను నటించింది. కానీ ఇటీవల ఈ అవకాశాలు కూడా లేవు. ప్రస్తుతానికి మోడలింగ్ అసైన్ మెంట్స్ తో కాలం నెట్టుకొస్తున్న ఈ బ్యూటీ ఇన్ స్టా అభిమానులకు నిరంతర ట్రీట్ ని కొనసాగిస్తోంది. తాజాగా రూహీ రెడ్ హాలి లుక్ ఇంటర్నెట్‌లో వైరల్ గా మారింది. థై స్లిట్ ఫ్రాక్ లో రూహీ



రకరకాల భంగిమల్లో చెలరేగిపోయింది. తాజా ఫోటోషూట్ లో ఎక్స్ క్లూజివ్ థై స్లిట్ ఎలివేషన్ కి చెందిన ఫోటోగ్రాఫ్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్ గా మారింది. అందాల రూహీ ఈ భంగిమలో చాలా హాలి గా, స్పెషల్ గా ఉందంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. రూహీ 2023లో సోషల్ కరెన్సీ అనే వెబ్ సిరీస్ లో నటించింది. ఆ తర్వాత కొత్త ప్రాజెక్ట్ గురించిన ఎలాంటి సమాచారం రాలేదు.

# కథ విన్నప్పుడే ఆ విషయం ఫిక్సయ్యా

అయితే హిట్3 సినిమా మొదటి సీన్ నుంచి వయొలెన్స్ గా ఉండదని, అవసరమైన చోట మాత్రమే ఇందులో యాక్షన్ ఉంటుందని, కెజిఎఫ్ సినిమాలకు హిట్3 సినిమాకు చాలా తేడా ఉందని చెప్పింది. కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాలతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ శ్రీనిధి శెట్టి. కెజిఎఫ్1, కెజిఎఫ్2 సినిమాలతో మంచి ఫాలోయింగ్ సంపాదించిన శ్రీనిధి ఇప్పుడు టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన హిట్: ది థర్డ్ కేస్ సినిమాలో శ్రీనిధి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో శ్రీనిధి మీడియాతో మాట్లాడి పలు విషయాలను షేర్ చేసుకుంది. .అయ్యేదెప్పుడు బాస్! కెజిఎఫ్, కెజిఎఫ్2, ఇప్పుడు హిట్3 మూడూ సినిమాలూ హింసతో కూడుకున్నవేనని, కానీ తాను మాత్రం చాలా సాఫ్ట్ అని, వయొలెన్స్ ను తాను వద్దనుకున్నా, వయొలెన్స్ తనను వద్దనుకోవడం లేదని, అయితే హిట్3 సినిమా మొదటి సీన్ నుంచి వయొలెన్స్ గా ఉండదని,



అవసరమైన చోట మాత్రమే ఇందులో యాక్షన్ ఉంటుందని, కెజిఎఫ్ సినిమాలకు హిట్3 సినిమాకు చాలా తేడా ఉందని చెప్పింది. ఈ సినిమా కథ విన్నప్పుడే యాక్షన్ సినిమా అని అర్థమైందని, అప్పుడే ఈ సినిమాకు ఏ సర్టిఫికేట్ వస్తుందని అర్థమైందని, ఈ విషయంలో నానితో ఏ సర్టిఫికేట్ మూవీ చేయడానికి నీకు 16 ఏళ్లు పట్టింది కానీ నేను నాలుగో సినిమాతోనే ఈ ఫీట్ ను సాధించానని చెప్తుంటానని శ్రీనిధి తెలిపింది.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# చీరలో అయేషా అందం..



ఈ స్టిల్ మామూలుగా లేదు ఈ ఏడాది శ్రీవిష్ణు హీరోగా వచ్చిన ఓం భీమ్ బుష్ మూవీలో ఓ కీలక పాత్రలో అయేషా ఖాన్ నటించింది. ఇప్పుడు టాలీవుడ్ లో గట్టిగా వినిపిస్తోన్న పేరు అయేషా ఖాన్. ఒక్క ఐటెం సాంగ్ తో టాలీవుడ్ లో విపరీతమైన క్రేజ్ ని ఈ బ్యూటీ సొంతం చేసుకుంది. మోడల్ గా, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ గా కెరియర్ స్టార్ట్ చేసిన అయేషా ఖాన్ హిందీలో ఓ ఆల్బం సాంగ్ లో నటించింది. ముఖచిత్రం మూవీతో టాలీవుడ్ లోకి హీరోయిన్ గా అడుగుపెట్టింది. ఈ ఏడాది శ్రీవిష్ణు హీరోగా వచ్చిన ఓం భీమ్ బుష్ మూవీలో ఓ కీలక పాత్రలో అయేషా ఖాన్ నటించింది. ఈ పాత్రకి మంచి గుర్తింపు వచ్చింది. విశ్వక్ సేన్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి మూవీలో ఐటెం సాంగ్ తో ఒక్కసారిగా అయేషా ఖాన్ అందరి కళ్ళు తనవైపు తిరిగేలా చేసుకుంది. ఆ సాంగ్ లో ప్రస్తుతం సోషల్ లో విపరీతంగా ట్రెండింగ్ అవుతోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com